క్లుప్తంగా

నేడు పెదగొన్నూరులో గడప గడపకు మన ప్రభుత్వం

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెదగొన్నూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ తెలిపారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మొవ్వ: స్పందన కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్ తెలిపారు. మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మూడు అర్జీలు అందాయన్నారు. మొవ్వపాలెం గ్రామంలో నూతన పంచాయతీ కార్యాలయం నిర్మించాలని గ్రామ సర్పంచ్ సీహెచ్ శివకుమారి ఓ అర్జీని అందించారు. అలాగే నిడుమోలు, కోసూరు గ్రామాలకు చెందిన భూ యజమానులు పట్టాదారు పాసు పుస్తకాలు కావాలంటూ దరఖాస్తులను అందచేశారన్నారు. ఆయా అర్జీలను సంబంధిత అధికారులకు అందించామని, త్వరలో సమస్యలను పరిష్కరిస్తారని చెప్పారు.

నేడు డయల్ యువర్ డీఎం

గుడివాడటౌన్: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు తెలియజేసేందుకు, సంస్థ అభివృద్ధికి సూచనలు, సలహాల స్వీకరణకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ రాజేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11.30 గంటల నుంచి 12.30 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రయాణికులు తమ సమస్యలను తెలియజేసేందుకు 99592 25464 మొబైల్ నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

బస్ సర్వీస్ ఏర్పాటు చేయాలని వినతి

ముదినేపల్లి రూరల్: జిల్లా కేంద్రమైన ఏలూరుకు ముదినేపల్లి నుంచి బస్ సర్వీసు ఏర్పాటు చేయాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నిమ్మగడ్డ భిక్షాలు కోరారు. ముదినేపల్లిలో సోమవారం మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల నుంచి వివిధ పనుల నిమిత్తం సచివాలయ ఉద్యోగులు, ప్రజలు ప్రతిరోజూ ఏలూరు వెళ్లాల్సి ఉందన్నారు. నేరుగా బస్ సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెవెన్యూ డివిజన్ కేంద్రం సైతం ఏలూరులో ఉన్నందున రైతులు తమ భూముల సమస్యల పరిష్కారం నిమిత్తం డివిజన్ కేంద్రానికి వెళ్లేందుకు అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు పరిస్థితిని గమనించి ప్రతి రోజూ ముదినేపల్లి నుంచి ఏలూరుకు బస్ సౌకర్యం కల్పించాలని కోరారు.

దోమల మందు స్ప్రేయర్లు అందజేత

మండవల్లి: ఆరు గ్రామాలకు దోమల మందు పిచికారీ స్ప్రేయర్లు అందజేయనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.మల్లీశ్వరి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొర్లపాడు, అప్పాపురం, చింతలపూడి, మొఖాసాకలవపూడి, పుట్లచెరువు, పసలపూడి గ్రామ పంచాయతీలకు స్ప్రేయర్లు వచ్చాయన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

పార్టీ బలోపేతానికి కృషి



బల్లిపర్రు(పామర్రు): గ్రామ స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు లాం తాంతియాకుమారి తెలిపారు. మండల పరిధి బల్లిపర్రు గ్రామంలో హాత్ సే హాత్ జోడో అభియన్ అనే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చేయి చేయి కలుపుదాం రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దాం అనే నినాదంతో గ్రామ గ్రామాన తిరిగి పార్టీ భవిష్యత్ కార్యక్రమాలను ఇంటింటికి తెలుపుతున్నామన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పెదపూడి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ.. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు అధికారంలోకి రాగానే సీపీఎస్ విధానం రద్దుపైనే తొలి సంతకం చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ నాయకులు ఫిరోజ్ బేగ్, సుబ్బారావు, వి.చెన్నయ్య, శ్రీనివాసరావు, పీవీ సుబ్బారావు, దాదాసాహెబ్ పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌లో తనిఖీలు

మోపిదేవి: మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర ఫిల్లింగ్ స్టేషన్‌లో తూనికలు, కొలతల అధికారితో కలిసి స్థానిక తహసీల్దార్ కె.నవీన్‌కుమార్ సోమవారం తనిఖీలు నిర్వహించారు. వినియోగదారులకు అందిస్తున్న సౌకర్యాలు, తూనికలను పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ పాత మిషన్లు తొలగించి కొత్త మిషన్ ఏర్పాటు చేస్తున్నామని బంక్ యజమాని తెలిపారు. కష్టమర్ల నుంచి ఎలాంటి విమర్శలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పలు సూచనలు చేసినట్లు తహసీల్దార్ వివరించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

క్రీడా పోటీల విజేతలకు అభినందనలు



గుడివాడలో విజేతలతో వ్యాయామ ఉపాధ్యాయులు

గుడివాడటౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పలు పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు సూచించారు. వివిధ క్రీడా పోటీల్లో విజేతలకు ఆయా పాఠశాలల్లో సోమవారం అభినందన కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్టీఆర్ స్టేడియం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 10కే, 6కే, 4కే క్రాస్‌కంట్రీ పరుగు పోటీల్లో తమ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారని ఎస్పీఎస్ మున్సిపల్ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు మడకా ప్రసాద్ తెలిపారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు 6కే రన్‌లో బి.నాగసుశీల, కె.కుమారి, డీవీఎస్‌డీ భవానిలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారన్నారు. 10కే రన్‌లో వై.దాలినాయుడు ద్వితీయ స్థానం, 4కే రన్‌లో బాలుర విభాగంలో జి.దివ్యభాస్కర్ ప్రథమ స్థానం సాధించడంతో పాటు మొత్తం 45 కన్సోలేషన్ బహుమతులు సాధించారని చెప్పారు. క్రీడాకారులను హైస్కూల్ హెచ్ఎం టీఎంత రాణి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

కరాటే పోటీల్లో విజేతలకు అభినందన

పామర్రు: రాష్ట్ర స్థాయి ఓపెన్ చాంపియన్‌షిప్–2023 కరాటే పోటీల్లో తమ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారని ఏఎస్ఎం హైస్కూల్ ప్రిన్సిపాల్ ఏ.పూర్ణచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక యలమర్రు రోడ్డులోని హైస్కూల్‌లో విజేతలను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ నిడదవోలులోని శ్రీరంగ సుబ్బారావు శ్రీమతి సత్యవతి కాపు కల్యాణ మండపంలో కరాటే పోటీలు జరిగాయన్నారు. అండర్–14 కటా విభాగంలో ఎ.వర్షికారెడ్డి, టి.హరిస్మిత, కె తేజస్వి, కె.చైతన్యలక్ష్మి, సీహెచ్ భాను రాకేష్, వి.హర్షిత్ ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణపతకాన్ని సాధించారని చెప్పారు. ఎస్.శ్రీజ చౌదరి, బి.కీర్తనరెడ్డి, ఎ.సాత్విక్, ఎం.పవన్‌కుమార్ ద్వితీయ స్థానంలో నిలిచి రజిత పతకాలను సాధించారన్నారు. విజేతలను, కోచ్ వీవీఎస్ రామకృష్ణలను ప్రిన్సిపాల్, హెచ్ఎం శర్మ, అధ్యాపక సిబ్బంది అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలను సాధించాలని ఆకాంక్షించారు.



పామర్రులో విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పూర్ణచంద్రారెడ్డి

కబడ్డీ పోటీల్లో ప్రతిభ

మండవల్లి: జిల్లా స్థాయిలో జరిగిన కబడ్డీ పోటీల్లో కానుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారని హెచ్ఎం ఎన్వై మాధవకుమార్ సోమవారం పేర్కొన్నారు. ఈ నెల 4న గుడివాడ వీకెఆర్ అండ్ వీఎన్‌బీ పాలిటెక్నిక్ కళాశాలలో ఉమ్మడి కృష్ణాజిల్లాలోని పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా సర్పంచ్ ఎన్.థామస్ ఆధ్వర్యంలో సోమవారం అభినందన సభ నిర్వహించారు. విజేతలను అభినందించారు. ఎస్ఏ–1 పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన 10వ తరగతి విద్యార్థులు ఏ.మౌనిక, కె.సోనికలను సత్కరించారు.



కానుకొల్లులో విజేతలను అభినందిస్తున్న సర్పంచ్ థామస్, హెచ్ఎం మాధవకుమార్

ఘనంగా మహిళా దినోత్సవం



మహిళలను సత్కరిస్తున్న కొనకళ్ల ట్రస్ట్ సభ్యులు



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్‌లు

గుడివాడటౌన్: పట్టణంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పామర్రు రోడ్డులోని హనుమాన్ దత్త సాయి మందిరంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కొనకళ్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలను సత్కరించారు. వల్లూరిపల్లి లక్ష్మి, దండమూడి జయలక్ష్మి, సరస్వతిలను సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ పాలకవర్గ సభ్యులు దండమూడి సీతారామస్వామి, బొగ్గారపు తిరుపతయ్య, తిరివీధి శ్రీరాములు, లింగం ప్రసాదు పాల్గొన్నారు.

- స్థానిక తారక రామా వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కరోనా సమయంలో సేవలందించిన సంజీవిని హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ కె.శ్రావణిని సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎస్కే మహబూబ్ అలీ, కె.సాయి సుబ్రహ్మణ్యం, చిన్నం గంగాధర్, ఎం.బలరామ్, డి.సురేష్ పాల్గొన్నారు.
- ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సరోజినీ నాయుడు జయంతి సందర్భంగా డివిజనల్ పంచాయతీరాజ్ ఆఫీసర్ జి.సంపత్‌కుమారిని సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు అర్జా ప్రసాద్, కార్యదర్శి వంగపండు బ్రహ్మాజీ, ఎస్.శివరామకృష్ణయ్య, బి.కుటుంబరావు, పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థుల ర్యాలీ

గుడివాడటౌన్: జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఏకేటీపీ మున్సిపల్ బాలికల హైస్కూల్‌లో ఎన్‌సీసీ విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. 4 ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్‌లు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. తొలుత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పోస్టర్ మేనేజ్‌మెంట్ పోటీలు నిర్వహించారు. ఎన్‌సీసీ ఆఫీసర్ కె.అనూరాధ, రెడ్‌క్రాస్ సొసైటీ గుడివాడ బ్రాంచ్ చైర్మన్ చలసాని స్పందన, ప్రధానోపాధ్యాయుడు ఎం.ఉమామహేశ్వరరావు, చీఫ్ ఆఫీసర్ మడకా ప్రసాద్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

ఉద్యాన శాఖాధికారులు

తోట్లవల్లూరు: మిరప, మినుము పంటల్లో సస్యరక్షణ చర్యలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన శాఖాధికారులు తెలిపారు. మిరప పంటలో నల్లతామర పురుగు ఉధృతి అధికంగా ఉన్నట్లు గుర్తించామని ఉద్యానశాఖాధికారి చందు జోసఫ్ చెప్పారు. తోట్లవల్లూరు లంకలో ఆయన మిరప పంట పొలాలను సోమవారం పరిశీలించారు. నల్లతామరను గతేడాది నవంబర్‌లోనే గుర్తించి రైతులకు తగిన సూచనలు చేశామన్నారు. నల్లతామరతో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎటువంటి ఆర్థిక నష్టం వాటిల్లదని చెప్పారు. సరైన సస్యరక్షణ చర్యలు పాటించటం ద్వారా పురుగు ఉధృతి తగ్గించి, తగిన దిగుబడులు పొందవచ్చని ఆయన సూచించారు. తల్లి పురుగులు గుడ్లు పెట్టకుండా వేపనూనె 10 వేల పీపీఎం, 0.50 ఎంఎల్ జిగురు, 1 ఎంఎల్ నీటిలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. అలాగే బవేరియా బస్సియానా, వెర్టిసిల్లీయం లక్కాని అనే జీవశిలీంధ్ర నాశిని 5 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారి చేస్తే పురుగు ఉధృతి తగ్గుతుందన్నారు. ఎకరానికి 50 గ్రాముల ఫ్రైడ్ లేదా బెనేవియా 250 ఎంఎల్ లేదా రీజంట్ 50 గ్రాములు లేదా ఇమిడిక్లోప్రిడ్, రీజెంట్ కలిపి 50 గ్రాములు చొప్పున పిచికారీ చేయాలన్నారు. ఎకరాకు 15 బ్లూస్టిక్ ట్రాప్స్, 15 ఎల్లో స్టికెట్ ట్రాప్స్ అమర్చుకోవటం వలన తామర పురుగు ఉధృతి ఎప్పటికప్పుడు గమనించటానికి అవకాశం ఉంటుందని చందు జోసఫ్ తెలిపారు. రైతులు పడమట హరిప్రసాద్, రావులపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



తోట్లవల్లూరు లంకలో మిరప పైరును పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారి చందుజోసఫ్

ఘనంగా ఎమ్మెల్యే కైలే పుట్టినరోజు వేడుకలు

పామర్రు: నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అన్ని మండలాల్లో పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పుట్టినరోజు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. వాడవాడలా పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. భారీగా కేకుల కటింగ్, చీరల పంపిణీతో పాటు ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు రొట్టెలు, పాలు అందజేశారు. అయా కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఎమ్మెల్యే కైలేకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో భారీ కేక్‌ను ఎమ్మెల్యే సోదరుడు కైలే జగదీష్, శ్రీనాథ్‌రెడ్డి కట్ చేశారు. స్థానిక గఫార్ సెంటర్‌లో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, నాయకులు పాల్గొని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. నాలుగురోడ్ల కూడలి వద్ద టౌన్ నాయకుల ఆధ్వర్యంలో, వాసవీ వృద్ధ శరణాలయంలో అన్నదానం, ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని రోగులకు పండ్లు, రొట్టెలు, పాలు అందజేశామని వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు తెలిపారు. జమీగొల్వేపల్లిలో పార్టీ నాయకులు వల్లభనేని బుల్లిబాబు(బుల్లియ్య) ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు.

పమిడిముక్కలలో..

పామర్రు(పమిడిముక్కల): పమిడిముక్కల మండల కన్వీనర్ యలమంచిలి గణేష్, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్ ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. మండల పరిధిలోని తాడంకి, కపిలేశ్వరపురం, పమిడిముక్కల, ఐనపర్రు, చోరగుడి తదితర జెడ్పీ హైస్కూళ్లలోని విద్యార్థులకు జెడ్పీటీసీ వెంకట రమణకుమారి స్వీట్లు పంపిణీ చేశారు.



పామర్రులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సోదరుడు కైలే జగదీష్, ప్రజాప్రతినిధులు

చినపారుపూడిలో..

చినపారుపూడి(పెదపారుపూడి): మండలంలోని చినపారుపూడి గ్రామంలో ఎంపీపీ గోగం సురేష్ కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. పెదపారుపూడి సెంటర్‌లో పీఏసీఎస్ బ్యాంక్ అధ్యక్షుడు తుమ్మల కోటేశ్వరరావు, నాయకులు కేక్ కట్ చేశారు. యలమర్రు సచివాలయ కన్వీనర్ నవదాసరి శ్యామల ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. ఎమ్మెల్యే కైలేకు నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు.

మహాశివరాత్రికి చురుగ్గా ఏర్పాట్లు



భక్తుల స్నానాల కోసం సిద్ధం చేసిన కోనేరు

కైకలూరు(కలిదిండి): దక్షిణ కాశీగా పేరుగడించిన కలిదిండి శ్రీపార్వతీ సమేత శ్రీపాతాళ భోగేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి మహోత్సవ ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఇప్పటికే దేవాలయం వద్ద భక్తుల కోసం చలువ పందిర్లు ఏర్పాటు చేశారు. భక్తులు స్నానాలు ఆచరించడానికి పంచబుగ్గల కోనేరులో నీటిని నింపారు. ఇటీవల ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ పోలీసు బందోబస్తు నిమిత్తం దేవాలయం వద్ద పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. భోగేశ్వరలంకలో మహాశివరాత్రి తీర్థం ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. 17న రాత్రి స్వామివారి కల్యాణోత్సవం, 18వ తేదీన మహాశివరాత్రి తీర్థం, స్వామివారి తెప్పోత్సవం జరుగుతుందన్నారు. మహాశివరాత్రి రోజున దాదాపు లక్ష పైబడి భక్తులు విచ్చేస్తారని అంచనా వేస్తున్నామన్నారు.

భూముల రీ సర్వే ప్రారంభం



గరికపర్రులో సర్వే ప్రారంభిస్తున్న తహసీల్దార్ వెంకటశివయ్య

తోట్లవల్లూరు: భూముల రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య తెలిపారు. జగనన్న సమగ్ర భూహక్కు భూరక్ష పథకంలో భాగంగా మండలంలోని గరికపర్రు, కనకవల్లి గ్రామాల్లో డ్రోన్ ఫ్లై కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. రెండు గ్రామాల్లో సుమారు 1,222 ఎకరాల్లో అధికారులు డ్రోన్ ఫ్లై నిర్వహించారు. డ్రోన్ ఫ్లై మ్యాప్‌లు రాగానే క్షేత్రస్థాయి సర్వే జరుగుతుందని, దీనికి ప్రతి రైతు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ చెప్పారు. కుమ్మమూరు, యాకమూరు గ్రామాలలో మంగళవారం డ్రోన్ ఫ్లై కార్యక్రమం జరుగుతుందన్నారు. సర్పంచ్‌లు వీరంకి రమాదేవి, పీవీ నరసింహశర్మ, ఎంపీటీసీలు మరీదు వెంకటశివమధుబాబు, నర్రా అప్పారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బోలెం శివనాగమల్లేశ్వరరావు(చంటి), ఆర్బీకే చైర్మన్ సోమన శ్రీనివాసరావు, మండల సర్వేయర్ సురేష్‌బాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శిశుగృహాన్ని సందర్శించిన జేసీ



సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ అపరాజితసింగ్

మచిలీపట్నంటౌన్: నగరంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశు గృహ, బాలసదనంలను జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్ సోమవారం సందర్శించారు. చిన్నారులకు అందుతున్న వసతులను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. శిశు గృహ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ భవన నిర్మాణానికి నిధుల విడుదల విషయంపై ఆ శాఖ డైరెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. శిశు గృహ భవన నిర్మాణ పనులు పూర్తయ్యేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ ఎస్.సువర్ణను ఆదేశించారు. పీడీ సువర్ణ, సూపర్‌వైజర్ మాలతి, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యానికి ప్రజలు సహకరించాలి



సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ మురళీకృష్ణ

గుడివాడటౌన్: పట్టణంలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ తెలిపారు. స్థానిక 23వ వార్డు సత్యనారాయణపురంలో ఇంజినీరింగ్, శానిటేషన్ సిబ్బందితో కలిసి సోమవారం ఆయన పర్యటించారు. మురుగునీరు డ్రెయిన్లలో నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మురుగు ప్రవాహానికి అడ్డంగా ఉన్న నిర్మాణాల తొలగింపు, లింకు డ్రెయిన్ల ఏర్పాటుపై అధికారులతో చర్చించి తక్షణమే సమస్య పరిష్కారం చేయాలన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. డ్రెయిన్లలో చెత్తతో నిండిన ప్లాస్టిక్ కవర్లు వేయడం వలన అవి ప్రవాహానికి అడ్డుగా ఏర్పడి దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమలు పెరగడానికి దోహదపడుతుందన్నారు. ప్రజలు శానిటేషన్ సిబ్బందికి సహకరించాలని కోరారు. చెత్తను డ్రెయిన్‌లో వేయరాదన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు వేగవంతం చేయండి



పంట పొలాల్లో రికార్డులు తనిఖీ చేస్తున్న ప్రమీల

గుడివాడటౌన్: ఈ-క్రాప్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేయడంతో రైతులు బహుళ ప్రయోజనాలు పొందవచ్చునని వ్యవసాయశాఖ అదనపు సంచాలకులు డి.ప్రమీల చెప్పారు. రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ఆమె వ్యవసాయ అధికారులతో కలిసి సోమవారం పర్యటించారు. క్షేత్రస్థాయిలో ఈ-క్రాప్ నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుభరోసా కేంద్రాల్లో పంట నమోదు చేసుకున్న రైతులు తప్పనిసరిగా వేలిముద్రలు వేయాలన్నారు. అది పంట గిట్టుబాటు ధర రాకపోయినా పంట నష్టం జరిగినా రైతుకు ఎంతగానో లాభం చేకూరుతుందని చెప్పారు. అనంతరం మినప పంట పొలాలను పరిశీలించి పురుగు ఆశించకుండా ఎలుకల బెడదను తప్పించుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆమె రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో గుడివాడ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎస్.రమాదేవి, మచిలీపట్నం ఎంఏఓ జి.శివప్రసాద్, గుడివాడ ఎంఏఓ బి.అనితాలక్ష్మి, ఏఈఓ, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

230 మందికి కంటి వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

గుడివాడటౌన్(నందివాడ): గ్రామ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు కుదరవల్లి గ్రామ సర్పంచ్ వసంతుల సత్యవతి అన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో సోమవారం విజయవాడకు చెందిన హోప్ ఫర్ హ్యూమనిటీ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కంటికి సంబంధించిన సమస్యలు ముందుగా గుర్తిస్తే వాటిని నివారించడం సుళువవుతుందనే ఉద్దేశంతో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించామన్నారు. 230 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 90 మందికి ఆపరేషన్‌లు అవసరంకాగా 100 మందికి పైబడి కళ్లజోళ్లు అవసరమవుతాయని వైద్యులు నిర్ధారించారు. కార్యక్రమంలో కంటివైద్య నిపుణులు, వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరం



కైకలూరులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పట్టణ సీఐ నాగరాజు(ఫైల్)

కైకలూరు: సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరమని కైకలూరు పట్టణ సీఐ ఎంవీఎస్ నాగరాజు సూచించారు. జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ ఆధ్వర్యంలో సైబర్ నేరాలను సమర్థవంతంగా ఎదుర్కొంటున్నామన్నారు. కైకలూరులో ఆయన సోమవారం మాట్లాడుతూ.. సెల్‌ఫోను, కంప్యూటర్ ఆధారంగా నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుని మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. తరుచుగా జరుగుతున్న నేరాల విషయంలో ఆధార్ అప్‌డేట్, పాన్ కార్డు, క్రెడిట్, డెబిట్ కార్డు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఈ-కేవైసీల కోసం అపరచిత వ్యక్తి ఫోన్ చేసి ఓటీపీ, పాస్‌వర్డ్ తెలుసుకుని బ్యాంకు ఖాతాలలో డబ్బులను దొంగిలిస్తున్నారన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఓటీపీ, పాస్‌వర్డ్‌లు చెప్పవద్దని పేర్కొన్నారు. అదే విధంగా 4జీ సిమ్ నుంచి 5జీ సిమ్ అప్‌డేట్, ఇన్‌స్టంట్ లోన్, వర్క్ ఫ్రం హోం జాబ్స్, లక్కీ డ్రా సెలక్ట్, ఆన్‌లైన్ షాపింగ్ ఆఫర్స్, కరెంటు బిల్లు పెండింగ్ నిమిత్తం 'ఈ కింది లింక్‌ను క్లిక్ చేయండి' అంటూ సెల్‌ఫోన్లకు సందేశాలు వస్తున్నాయన్నారు. పొరపాటున ఈ లింక్‌ను క్లిక్ చేస్తే సెల్‌ఫోన్‌లో గోప్యత సమాచారం సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కుతుందన్నారు.

టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయండి..

సోషల్ మీడియాలో ఫేక్ ఎకౌంట్‌లు క్రియేట్ చేసి ఆపదలో ఉన్నామని, డబ్బు సహాయం చేయాలని మోసం చేస్తారని, ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సీఐ నాగరాజు హెచ్చరించారు. ప్రధానంగా ఆన్‌లైన్ షాపింగ్ సైట్‌లలో తక్కువ ధరకు విలువైన వస్తువులు అందిస్తామని డబ్బులు పే చేయాలని ప్రచారం చేస్తున్నారన్నారు. అటువంటి ప్రకటనలకు ఆకర్షితులై డబ్బులు ముందుగా చెల్లించి, తీరా వస్తువులు రాకపోవడం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఒక అపరిచిత వ్యక్తి వాట్సాప్ వీడియో కాల్ చేసి మాట్లాడి మీకు తెలియకుండానే మీ కాల్ రికార్డింగ్ చేసి బెదిరింపులకు పాల్పడతారన్నారు. సైబర్ నేరాలపై టోల్ ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సీఐ తెలిపారు.

> **పోలీసులు మీ నేస్తాలు..**
>
> పోలీసు సిబ్బందిని ప్రజలు స్నేహితులుగా భావిస్తున్నారు. ప్రభుత్వం సచివాలయ స్థాయిలో మహిళా పోలీసు వ్యవస్థను తీసుకువచ్చింది. సైబర్ నేరాలు, ర్యాగింగ్, మత్తు పదార్థాల వినియోగంతో కలిగే నష్టాలను ప్రజలకు పోలీసులు వివరిస్తున్నారు. ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్న వారి వివరాలను సైబర్ పోలీసులకు తెలపండి.
>
> – ఎంవీఎస్.నాగరాజు, పట్టణ సీఐ, కైకలూరు

16 నుంచి రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

గూడూరు: దాదాపు 300 ఏళ్ల చరిత్ర కలిగిన గూడూరులోని గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి తిక్కిశెట్టి వీరవెంకట మోహనరావు తెలిపారు. గురువారం స్వామి వారిని పెండ్లి కుమారుడిని, అమ్మ వారిని పెండ్లి కుమార్తెను చేస్తారు. 17న అమ్మ వారికి కుంకుమ పూజలు, 18న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జగజ్యోతి, స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. 19న రథోత్సవం, 20న ధ్వజారోహణ ద్వాదశ ప్రదక్షిణలు, స్వామి వారికి పుష్పయాగం, పవళింపు సేవ నిర్వహిస్తామని వివరించారు. వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.